క్లుప్తంగా

సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న దృశ్యం

కుక్కునూరు : కుక్కునూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలోని గ్రామాలకు పరిహారం చెల్లించాలని కోరుతూ కుక్కునూరు జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి గురువారం ఏలూరులో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మెన్‌లకు వినతిపత్రం అందించారు. సాంకేతిక సమస్యల వల్ల రహదారి నిర్మాణంలో జాప్యం జరిగిందని పదిహేను రోజుల్లో రహదారి నిర్మాణం పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్టు కలెక్టర్ హామీ ఇచ్చారని ఎంపీపీ, జెడ్పీటీసీలు చెప్పారు.

అసంపూర్తిగా కల్వర్టు పనులు


అంసపూర్తిగా నిలిచిపోయిన కల్వర్టు పనులు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పేరంపేటలో అసంపూర్తిగా కల్వర్టు పనులు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ పేటలోని అంతర్గత రహదారులను మెయిన్ రోడ్డుకు కలుపుతూ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. మధ్యలోనే పనులు ఆపివేయడంతో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. కల్వర్టు పనులు పూర్తి చేయాలని పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 2.50 లక్షల విరాళం


దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన తీగల జనార్ధన శేషు గురువారం రూ. 2.50 లక్షలు విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

25న సర్వసభ్య సమావేశం

ద్వారకాతిరుమల: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాల్గొనాలని ఆయన కోరారు.

పేరంపేటలో సచివాలయానికి తాళాలు


సచివాలయ భవన తాళాలను తెరిపిస్తున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

జంగారెడ్డిగూడెం రూరల్ : పేరంపేటలో సచివాలయానికి కాంట్రాక్టర్ ఇర్ల శ్రీనివాసరెడ్డి తాళాలు వేసిన ఘటన చోటు చేసుకుంది. సిబ్బంది ఆరుబయటే వేచి ఉండటంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ స్లీవ జోజి, ఎంపీడీవో కొమ్ము కిరణ్‌కుమార్ పేరంపేట వెళ్లి కార్యాలయ తాళాలు తీయించి సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. సచివాలయ నిర్మాణానికి స్థలాన్ని దానం గా ఇచ్చిన శ్రీనివాసరెడ్డే భవన నిర్మాణ పనులకు కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. భవనంలో ఇంకా పనులు పూర్తి కావాల్సి ఉందని, అయినప్పటికీ పంచాయతీ రాజ్ శాఖ వారు పంచాయతీకి భవనాన్ని అప్పగించారని, అలాగే తనకు రూ.20 లక్షలు వరకు బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవనాన్ని తనకి అప్పగిస్తే పనులు పూర్తి చేస్తానన్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా భవన నిర్మాణానికి రూ.40 లక్షలు ఎస్టిమేట్లు కాగా, రూ.33 లక్షలకు బిల్లులు పెట్టామని, వీటిలో ఇప్పటి వరకు రూ.25 లక్షల వరకు కాంట్రాక్టర్‌కు చెల్లించగా, ఇంకా 8 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మూడు రోజుల క్రితం పంచాయతీకి సచివాలయ భవనాన్ని అప్పగించినట్లు తెలిపారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం


ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కుక్కునూరు : రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం కుక్కునూరులో మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు పాదయాత్రలో డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఇబ్బందులు తెలుసుకున్న జగనన్న వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించి మూడు విడతలుగా రూ.11 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమచేశారన్నారు. చంద్రబాబు తన హయాంలో ఏ ఒక్క హామీని పూర్తిచేయలేదని, దీంతో ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజల ముందుకు వచ్చేందుకు ముఖం చెల్లని చంద్రబాబు తన కొడుకుని రోడ్డుమీదకు పంపాడని ఆయనేమో తెలుగుదేశం అధికారంలోకి వస్తే ఆకాశాన్ని నేలకు తీసుకువస్తానని విడ్డూరపు హామీలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోని భగవద్గీతగా భావించి ఇచ్చిన హామీలను మూడేళ్లలో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు ఆర్అండ్ ఆర్ పరిహారాన్ని రూ.10 లక్షలు ఇవ్వడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ట్రాక్టర్లను బాలరాజు రైతులకు అందించారు. మండలంలోని అమరవరం, కోమట్లగూడెం, ఎలకలగూడెం గ్రామాలను మొదటి కాంటూర్ పరిధిలో చేర్చాలని కోరుతూ కోటగిరి నళిని ప్రవర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, ఎంపీడీఓ శ్రీనివాస్, కుక్కునూరు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు మాదిరాజు వెంకన్నబాబు, రావు వినోద్, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, రాయి సత్యనారాయణ, బట్టు వీరబాబు, గంజి రాజేష్, రాయి రవి, పరవా రామిరెడ్డి, కోటగిరి నళిని ప్రవార్, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, పోలగాని వెంకట్రావు, మాధవరావు, హరి, గుమ్మల సత్యనారాయణ, మల్లెల చంటినాయుడు, చిన్న నరసింహరాజు, అమరవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరి ట్రస్ట్ బోర్డ్ నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి అలయ ట్రస్టుబోర్డు నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. కాకినాడ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ నూతన నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో మానికల రాంబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదలైన 20 రోజుల్లో నూతన ట్రస్ట్ బోర్డు నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. గడువు అనంతరం పరిశీలన చేసి, ట్రస్టుబోర్డుపై నిర్ణయం జరుగుతుందని ఈవో మానికల రాంబాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ అంబేడ్కర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం, పర్రెడ్డిగూడెం, బైనేరు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవరత్నాలతో ప్రతి గడపలో సంతోషం


తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో సంక్షేమ లబ్ధిని వివరించి బ్రోచర్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే ఎలీజా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలన్నీ పూర్తి స్థాయిలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక పక్క సమస్యలు వింటూ మరోపక్క మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా మండల కార్యాలయాలు, టీడీపీ నాయకుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, అయినా పనులు అయ్యేవి కావన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక సచివాలయ, వలంటీర్ వ్యవసలను తీసుకువచ్చి నేరుగా ప్రజల వద్దకే పాలన తీసుకు వచ్చారని చెప్పారు. ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని గ్రామస్తులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డా.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ పరాంకుశం వెంకటేశ్వరరావు, గంగవల్లి సురేష్, ఎంపీటీసీ జొన్నకూటి సాగర్, ఈది రాజేష్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్ దుర్గా రావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మిరియాల దిలీప్, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణారావు, కె యువరాజు, యడ్ల మోహన్‌రావు, సీహెచ్ జ్ఞానారెడ్డి, జంగా చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్ పరిశీలన


కె గోకవరంలో ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

లింగపాలెం : కె గోకవరంలో జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్‌ను తహసీల్దార్ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో 24 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క ఇళ్లు కూడా నిర్మించకపోవడంతో అధికారులు లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఇళ్ల స్థలం రెండు చెరువుల మధ్య ఉన్నదని స్థలం చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించి స్థలంలో మెరక వేయించాలని లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు. లేఅవుట్‌ను పరిశీలించిన వారిలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మండలపు నరసింహరావు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రతి సచివాలయ ఉద్యోగి యూనిఫాంతో విధులకు హాజరుకావాలని ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం అన్నారు. గురువారం ధర్మాజీగూడెం సచివాలయాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి నోటీస్ బోర్డులో వివరాలను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఎంపీడీవో హెచ్చరించారు.

ఖరీఫ్‌లో ఇబ్బందులను అధిగమించాలి


సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న తహసిల్దార్ బి.సుమతి

పోలవరం రూరల్ : గత ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన ఇబ్బందులను అధిగమించి ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సొసైటీ సెక్రటరీలు , సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలో పోలవరం-1, పోలవరం-2 , గూటాల, కొత్తపట్టిసీమ ఆర్‌బీకేల్లో 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలు 2023 సీజన్‌కు సంబంధించి కేటాయించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నాణ్యతా ప్రమాణాల పరీక్ష , గొనె సంచులు తదితర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వరికోతలు పూర్తి చేసిన రైతులందరూ ఆర్‌బీకేల్లో సిబ్బందిని కలిసి ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం


నవధాన్యాల ప్రదర్శనను నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ద్వారకాతిరుమల : పుడమితల్లికి జీవం.. మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేది ప్రకృతి వ్యవసాయమేనని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి ఒబిలిశెట్టి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నవధాన్యాలు (పచ్చిరొట్ట ఎరువులు) ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డిజిటల్ ఎల్-2 సుబ్బారావు, గ్రామ సర్పంచ్ పల్లి నిర్మల, ప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ(చిన్న చిన్ని), ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో వైద్యశిబిరం


గొట్టాలరేవులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బుట్టాయగూడెం : మండలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా కొండ అటవీప్రాంతంలో ఉన్న చింతకొండ, గొట్టాల రేవు, పూచికగొంది కొండరెడ్డి గ్రామాల్లో గురువారం దొరమామిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఏఎస్‌వీ ప్రవీణ్ గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో వచ్చే వ్యాధులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా ఎండ నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా మారుమూల ఎత్తైన కొండప్రాంతాల్లో ఈ గ్రామాలు ఉన్నాయి. పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది కాలినడకనే కొండను దాటుకుంటూ ఆ గ్రామానికి చేరుకుని గిరిజనులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఎల్. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

31 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ


శ్రీనివాసపురంలో లాటరీ విధానం ద్వారా ఇళ్ల స్థలాలను కేటాయిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి గృహాలు నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో 31 మందికి లాటరీ విధానం ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, జుజ్జవరపు శ్రీను, పాడిదోలు రాంబాబు, ప్రత్తిపాటి రాజారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పాత పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం, సీపీఐ దేశరక్షణ భేరి ప్రచార యాత్రలు ముగింపు సభ గురువారం నిర్వహించారు. ఈ సభకు సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సీపీఐ మండల కార్యదర్శి రమణ రాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణచైతన్య మాట్లాడారు. మోడీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల కాలంలో 75 సంవత్సరాల భారతదేశ సంపదలైన ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అంబానీ, అదానిలకు కట్టబెట్టడం దారుణమన్నారు. పేదలపై పన్నుల భారాలు మోపుతూ అంబానీ, అదానీలకు లక్షల కోట్లు పన్ను రాయితీలు ఇస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు.

కొయ్యలగూడెం : భారతదేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పంటను పండించుకున్న రైతన్న పొలాల వద్ద ఉన్న బోర్లకు కరెంటు మీటర్లు బిగించడం ఎంతవరకు సమంజసం అని మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మోడీ ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ, సీపీఎం పార్టీల ప్రచార భేరి కార్యక్రమం మంగపతి దేవి పేట గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్ద నిర్వహించారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం


గూటాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


కామవరపుకోటలో గ్రామస్తులకు బ్రోచర్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కామవరపుకోట : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ అన్నారు. గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొండగూడెంలో గ్రామస్తులకు బ్రోచర్లు అందజేయడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించి, ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా పండు జగదీష్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకెళుతుందని, దీనితో ప్రజలు సీఎం జగన్‌కు అండగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ పండు ప్రసన్న, అందుగుల జాన్, నేతల రాజు, దావీదు, రమేష్, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పోలవరం మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. గూటాల గ్రామంలో సొసైటీ అధ్యక్షులు సుంకర అంజిబాబు, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి, స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో గంధం రాజు, మహంతి అబ్బులు, ఒబిలిశెట్టి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 4వ వార్డులో గురువారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. 4వ వార్డు సచివాలయ కన్వీనర్ పి.సరస్వతి రాజా, వార్డు ఇన్‌చార్జి చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు వివరిస్తూ పరిపాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన చాలా బాగుందని, వలంటీర్ వ్యవస్థ ద్వారా మాకు అన్ని పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా తెలియజేసినట్లు చిప్పాడ వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు తీయాల శివప్రసాద్, భూకే ప్రసాద్, వంశీ పాల్గొన్నారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

జంగారెడ్డిగూడెం : ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.అరుణ తెలిపారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (డిసిఓ) ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న జంగారెడ్డిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల నందు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం. 8.30 గంటల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 1.30 గంటలకు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ పి.అరుణ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు: 94411 87140 ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించగలరు.

నేడు మహాజన సోషలిస్టు పార్టీ సమావేశం

కొయ్యలగూడెం : ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పోలవరం నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ విస్సంపల్లి సిద్ధు మాదిగ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ సనమండ్ర కనకరాజు మాదిగ అధ్యక్షతన కన్నాపురం రోడ్‌లోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

టి.నరసాపురం : రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్‌బీకేల ద్వారా రైతు సంఘాల ప్రతినిధులకు 40 శాతం రాయితీపై రూ.15 లక్షల విలువ గల ట్రాక్టర్లు, డిస్కులు, కల్టివేటర్‌లు, రోటావేటర్లు, ట్రక్కులు, స్ప్రేయర్లు, గడ్డి చుట్టే యంత్రాలు, తదితర పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు 5 మంది ఒక సంఘంగా ఏర్పడాలన్నారు. ఈ పథకంలో 50శాతం ముందుగా గ్రూపు వాటాగా చెల్లించాలని, మిగిలిన 50 శాతం బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చన్నారు. తద్వారా 40 శాతం రాయితీ నేరుగా గ్రూపు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే కిసాన్ డ్రోన్‌లు కూడా 40 శాతం రాయతీతో గ్రూపు సభ్యులకు అందిస్తామన్నారు. వివరాలకు స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఎల్ఎన్‌డీ పేట పునరావాస కేంద్రం పరిశీలన


ఎల్ఎన్‌డీపేట పునరావాసకేంద్రంలో పాఠశాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ స్వరూప్

పోలవరం రూరల్ : మండలంలోని ఎల్ఎన్‌డీపేట పునరావాస కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ స్వరూప్ గురువారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఇళ్ల నిర్మాణం, వసతులు తదితర సమస్యలను నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను కూడా పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. విద్యను అందిస్తున్న విధానంపై తెలుసుకున్నారు. ఈయన వెంట ఐటీడీఏ డీఈ శ్రీనివాసరావు, సెక్రటరీ పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

టి.నరసాపురం : నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఏపుగుంట, మెట్టగూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించగా, నాటు సారా విక్రయిస్తున్న ఏపుగుంట గ్రామానికి చెందిన వీరంకి వెంకటరమణను అరెస్టు చేసి అతని నుంచి 5లీటర్ల నాటు సారా, మెట్టగూడెం గ్రామంలో పల్లగాని శ్రీదేవి వద్ద నుంచి 5లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా, 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.